సాక్షి
నిర్మల్
బుధవారం । 12 । ఏప్రిల్ । 2023



అభాగ్యులకు అభయం!
తల్లిదండ్రులను కోల్పోయి అభాగ్యులైన పిల్లలకు మహిళా శిశు సంక్షేమశాఖ ద్వారా ఆర్థికసాయం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మిషన్ వాత్సల్య పథకాన్ని అమలు చేస్తున్నాయి. 8లో▸



సహకార 'బంక్'ల కథ కంచికేనా?
ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బలోపేతానికి ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ల నిర్వహణ గాడితప్పింది. ఆదిలోనే మూతపడే పరిస్థితి నెలకొంది. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
40.2/26.7

వాతావరణం
ఆకాశంలో అక్కడక్కడా మేఘాలు ఉంటాయి. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయి. వేడి, ఉక్కపోత పెరుగుతుంది. మధ్యాహ్నం బయటకు వెళ్లొద్దని వైద్యులు సూచిస్తున్నారు.



ఇఫ్తార్	సహర్
బుధ 6:30	గురు 4:43

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

ముగిసిన టెన్త్ పరీక్షలు



నిర్మల్ రూరల్: పదో తరగతి వార్షిక పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు మంగళవారం సోషల్ స్టడీస్ పరీక్షకు 10 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 9,083 మంది విద్యార్థులకు 9,073 మంది హాజరయ్యారు. జనరల్ కేటగిరీలో 9 మంది, ఒకేషనల్ కేటగిరీలో ఒక విద్యార్థి గైర్హాజర్ అయినట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. మే నెల రెండోవారంలో ఫలితాలు ప్రకటించే అవకాశం ఉంది. మరో రెండు రోజుల్లో జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలలో మూల్యాంకనం ప్రారంభిస్తారు.

ఖానాపూర్ మీదుగా హైదరాబాద్‌కు బస్సు

ఖానాపూర్: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి నుంచి ఖానాపూర్, కడెం, జన్నారం, లక్సెట్టిపేట, కరీంనగర్ మీదుగా హైదరాబాద్ వరకు నూతన బస్సు సర్వీస్ ప్రారంభించినట్లు టీఎస్ఆర్టీసీ కరీంనగర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు మెట్‌పల్లి నుంచి ప్రతీరోజు సాయంత్రం 6.45 గంటలకు ప్రారంభమై ఖానాపూర్, కడెం, మీదుగా జన్నారం, లక్సెట్టిపేట మీదుగా కరీంనగర్ వెళ్లి అక్కడి నుంచి హైదరాబాద్ చేరుతుందని వివరించారు. మళ్లీ రాత్రి 10 గంటలకు హైదరాబాద్‌లో ప్రారంభమై మరునాడు ఉదయం మెట్‌పల్లికి చేరుకుంటుందని తెలిపారు. ఈ సర్వీస్‌ను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

14న అడెల్లి పోచమ్మ ఒడిబియ్యం సేకరణకు వేలం

సారంగపూర్: అడెల్లి మహాపోచమ్మ అమ్మవారికి భక్తులు సమర్పించే ఒడిబియ్యం సేకరించుకునే హక్కుల కోసం ఈనెల14న బహిరంగ వేలం నిర్వహిస్తామని ఆలయ ఈవో రవికిషన్‌గౌడ్ తెలిపారు. వేలంలో పాల్గొనే వ్యాపారులు అదేరోజు ఉదయం 9 గంటలకు హాజరై ఆలయ అధికారులను సంప్రదించాలని సూచించారు. దేవాదాయ శాఖ నిర్ణయించిన ధరావత్తు సొమ్ము చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు. ఆలయ నిబంధనల మేరకు వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు.


వానాకాలం సాగుపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న డీఏవో అంజిప్రసాద్

భైంసాటౌన్: వానాకాలం పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ అన్నారు. పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏడీఏలు, ఏవోలు, ఏఈవోలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించే విధానాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి, జీవన ఎరువులపై అవగాహన కల్పించాని సూచించారు. తద్వారా పెట్టుబడుల్లో వ్యత్యాసం, సాగు ఖర్చులు వివరించాలని పేర్కొన్నారు. సమావేశంలో ఏడీఏలు సోమలింగారెడ్డి, వీణ, ఏవో రాంచందర్‌నాయక్, ఏఈవోలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు దేగాం విద్యార్థి



భైంసారూరల్: మండలంలోని దేగాం గ్రామానికి చెందిన ఆకాశ్ జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికయ్యాడని పీఈటీ ప్రేమలత తెలిపారు. ముథోల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఆకాశ్ హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన రెజ్లింగ్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచాడు. ఈనెల చివరి వారంలో ఉత్తరప్రదేశ్‌లో నిర్వహించే జాతీయస్థాయి అండర్–17 పోటీల్లో ఆకాశ్ పాల్గొంటాడని తెలిపారు.

ఏలేటి అడుగెటు..?

- నిర్మల్‌లో అనుచరులతో భేటీ
- కమలంవైపు కార్యకర్తల మొగ్గు
- తుది నిర్ణయం ప్రకటించని మహేశ్వర్‌రెడ్డి
- అన్నిపార్టీల నుంచి టచ్‌లో ఉన్నారని వెల్లడి



తన నివాసంలో నాయకులు, అనుచరులతో భేటీ అయిన ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్:ఏఐసీసీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పనున్నారా?.. సంచలన నిర్ణయం తీసుకోబోతున్నారా? తన రాజకీయ భవిష్యత్తుపై త్వరలో ఓ క్లారిటీ ఇవ్వనున్నారా..? అంటే అవుననే సమాధానం వస్తోంది కాంగ్రెస్‌శ్రేణుల నుంచి. అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న వేళ క్షేత్రస్థాయి ప్రభావానికి తగ్గట్లు ఏలేటి అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఈమేరకు జిల్లా కేంద్రంలోని తన నివాసంలో మంగళవారం పార్టీ ప్రధాన కార్యకర్తలు, తన ముఖ్య అనుచరులతో సుదీర్ఘంగా మంతనాలు జరిపారు. ఈ సమావేశంలో మెజారిటీ కార్యకర్తలు, అనుచరులు బీజేపీలో చేరితేనే ఎన్నికల సమరంలో గెలువగలమని వెల్లడించినట్లు తెలిసింది. వారి నిర్ణయాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటానన్న మహేశ్వర్‌రెడ్డి తుది నిర్ణయాన్ని మాత్రం ప్రకటించలేదు. మరోవైపు ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి త్వరలోనే కాషాయ కండువా కప్పుకుంటారని కొంతమంది కాంగ్రెస్ కార్యకర్తలే సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు.

భవిష్యత్‌పై..

ఎన్నికలు సమీపిస్తుండటంతో జిల్లాలో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ఆత్మీయ సమ్మేళనాలతో బీఆర్ఎస్‌లో ఇప్పటికే గులాబీ శ్రేణుల్లో సందడి నెలకొంది. అదే పార్టీలో శ్రీహరిరావు, సత్యనారాయణగౌడ్‌లాంటి సీనియర్లు ఎదురుతిరగడమూ చర్చనీయాంశమైంది. మరోవైపు కాంగ్రెస్‌లోనూ పెను మార్పులు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా ఏఐసీసీ నేత మహేశ్వర్‌రెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై సీరియస్‌గా ఆలోచిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయి, ఓటర్ల తీరు ఎలా ఉందని ఆరా తీస్తున్నారు.

కమలంవైపే అనుచరుల మొగ్గు..

ప్రస్తుత పార్టీలో ఉండటమా.. పార్టీ మారడమా.. ఎన్నికలకు ఎలా ముందుకు వెళ్లాలి.. అనే అంశాలపై ఏలేటి తన ప్రధాన అనుచరులు, ముఖ్య నాయకులతో చర్చించారు. ప్రస్తుత పరిస్థితుల్లో బీజేపీలోకి వెళ్తేనే బాగుంటుందన్న అభిప్రాయం ఎక్కువమంది కార్యకర్తల నుంచి వచ్చినట్లు తెలిసింది. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ కంటే ప్రస్తుతం బీజేపీ మెరుగ్గా ఉందన్న అభిప్రాయాన్ని మెజార్టీ నాయకులు వెల్లడించినట్లు సమాచారం. మహేశ్వర్‌రెడ్డి ఏ పార్టీలో ఉన్నా.. తన వెంటే ఉంటామని, ఈసారి ఎలాగైనా గెలవాలని చెప్పినట్లు ఓ సీనియర్ నేత వెల్లడించారు. మరోవైపు మహేశ్వర్‌రెడ్డి త్వరలోనే బీజేపీలో చేరనున్నారని, ఈనెల 14న మంచిర్యాలలో కాంగ్రెస్ సభరోజే ఆ పార్టీకి షాక్ ఇవ్వనున్నారని తెలుస్తోంది. నేడో రేపో ఢిల్లీకి కూడా వెళ్తారని సోషల్ మీడియాలో పోస్టులు వైరల్ అవుతున్నాయి.

ఆలోచించి నిర్ణయం..



రాజకీయ భవిష్యత్‌పై చాలా రోజుల నుంచి చర్చ జరుగుతోంది. ఈనేపథ్యంలోనే పలువురు నాయకులతో సమావేశం నిర్వహించా. బీజేపీతో పాటు బీఆర్ఎస్ నుంచీ ఆహ్వానం ఉంది. కానీ పార్టీ మార్పుపై ఇప్పుడే నిర్ణయం తీసుకోవడం లేదు. మరోసారి అందరితో ఆలోచించి సరైన నిర్ణయం తీసుకుంటా.

– ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్

బహుజనుల ఆశాజ్యోతి పూలే

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



మహాత్మా జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న మంత్రి, కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: బహుజనుల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబాపూలే అని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. పూలే 197వ జయంతి పురస్కరించుకుని కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఐకేరెడ్డి మాట్లాడుతూ మహాత్మా జ్యోతిబాపూలే సేవలు మరువలేనివన్నారు. ఆయన అడుగుజాడల్లో యువత నడవాలన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి, మహిళా విద్యకు పూలే చేసిన కృషిని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పూలే జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు. పూలే చూపిన బాటలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలోని తెలంగాణ ప్రభుత్వం ముందుకుసాగుతోందని పేర్కొన్నారు.

చదువుతో భరోసా...

కలెక్టర్ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ పూలే ముఖ్యంగా బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. స్త్రీ విద్య సమాజానికి ఎంతో అవసరమని, చదువే భరోసా ఇస్తుందని పూలే నాడే భావించారని తెలిపారు. స్త్రీ విద్య కోసం విశేష సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, అదనపు కలెక్టర్ రాంబాబు, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, లోకేశ్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



సమీకత కలెక్టరేట్ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్:ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. నూతన సమీకృత కలెక్టరేట్ భవనం పనులను అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా నిర్మల్ సమీకృత కలెక్టరేట్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. అధునాతన సౌకర్యాలు, సకల హంగులతో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అన్ని గదుల్లో ఏర్పాట్లను పరిశీలిస్తూ అధికారులకు సూచనలు చేశారు. ప్రాంగణంలో గార్డెనింగ్, మొక్కలు నాటడం సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. బార్డర్ ప్లాంటేషన్ చేయాలని, ఆహ్లాదకరమైన పచ్చని వాతావరణం కల్పించేలా మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. వాహనాల పార్కింగ్, హెలిప్యాడ్ పరిశీలించి కలెక్టరేట్ చుట్టూ మొక్కలు నాటాలని తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్హులకే డబుల్ బెడ్‌రూం ఇళ్లు

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



సమావేశంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎమ్మెల్యే రేఖానాయక్

కడెం: అర్హులకే డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయిస్తామని కలెక్టర్ వరుణ్‌రెడ్డి స్పష్టం చేశారు. కడెం, కన్నాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. ఎమ్మెల్యే రేఖానాయక్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. పెద్దూర్‌లో నిర్మించిన మొత్తం 200 డబుల్ బెడ్‌రూం ఇళ్లను కడెం పంచాయతీలో 150 మందికి, కన్నాపూర్ పంచాయతీలో 50 మందికి కేటాయిస్తామని తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక కోసం మరోసారి గ్రామాల్లో సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎంపికపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే జీపీ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన బాక్సుల్లో ఫిర్యాదులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ చిన్నయ్య, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీపీ అలెగ్జాండర్, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు రఫీక్ అహ్మద్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ జీవన్‌రెడ్డి, సర్పంచులు అనూష, నరేందర్‌రెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

అధికారులతో సమావేశం..

గ్రామ సభల అనంతరం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. మారుమూల గ్రామాలకు సైతం అంబులెన్స్ వెళ్లేలా రోడ్డు ఉండాలని సూచించారు. విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం కొత్త మద్దిపడగ గ్రామ సమీపంలో రాంపూర్, మైసంపేట్ గ్రామస్తులకు నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించారు. కొత్త మద్దిపడగ గ్రామ సమీపంలోని పునరావాస కాలనీలో ఇళ్ల నిర్మాణాలు సక్రమంగా లేవని రాంపూర్, మైసంపేట్ వాసులు ఇటీవలే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఇళ్లను పరిశీలించి కాంట్రాక్టర్‌కు, అధికారులకు సూచనలు చేశారు.

మహిళా ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటుకు కృషి



కిష్టాపూర్ కరపత్రలను విడుదల చేస్తున్న మహిళా అభివృద్ధి సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రవీణ్

లోకేశ్వరం:గ్రామాల్లో మహిళా ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటుకు కృషి చేస్తామని మహిళా అభివృద్ధి సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రవీణ్ తెలిపారు. మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో ఐకేపీ సభ్యులతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటు కోసం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి కరపత్రాలు విడుదల చేశారు. ఈసందర్భంగా మహిళా అభివృద్ధి సంస్థ కోఆర్డినేటర్ ప్రవీణ్ మాట్లాడుతూ రైతులందరూ సంఘాలుగా ఏర్పడి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఏర్పాటు చేసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. రైతు సంఘాలను ఏర్పాటు చేసి వాటిని రిజిస్టర్ చేస్తామని తెలిపారు. కేశ్వరం మండలంలో 12 గ్రామాల్లో రైతుల సంఘాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌పీవో సీఈవో మేఘన, అకౌంటెంట్ సంతోష్, బీవోడీ లక్ష్మి పాల్గొన్నారు.

బడికి టాటా.. ఇంటి బాట



పదేళ్ల పాఠశాల విద్య పూర్తయింది. ఇన్నాళ్లూ కలిసి చదువుకున్న విద్యార్థులంతా మంగళవారం టెన్త్ చివరి పరీక్ష రాశారు. పరీక్ష అనంతరం ఇంటిబాట పట్టారు. హాస్టళ్లలో ఉండి చదువుకున్న విద్యార్థులు పరీక్ష పూర్తికాగానే హాస్టల్‌కు చేరుకుని భోజనం చేసిన తర్వాత సామగ్రి సర్దుకున్నారు. కుటుంబ సభ్యులు వచ్చే వరకు ఆటపాటలతో గడిపారు. తల్లిదండ్రులు రాగానే స్నేహితులకు టాటా చెబుతూ ఇళ్లకు బయల్దేరారు. విద్యార్థులు ఇంటిబాట పట్టడంతో బస్టాండ్లలో రద్దీ కనిపించింది. బస్సులు విద్యార్థులతో కిటకిటలాడాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్ నిర్మల్





జిల్లా ఏర్పాటుతో గణనీయమైన అభివృద్ధి

- ఈ ఘనత సీఎం కేసీఆర్‌దే
- బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి ఐకేరెడ్డి



మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, వేదికపై ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్‌పర్సన్, మున్సిపల్ చైర్మన్‌తదితరులు

నిర్మల్‌టౌన్: నిర్మల్‌ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయడం ద్వారా గణనీయమైన అభివృద్ధి సాధిస్తోందని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. ఈ ఘనత పూర్తిగా సీఎం కేసీఆర్‌దే అని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్‌లో పట్టణంలోని పది వార్డులకు సంబంధించిన ఆత్మీయ సమ్మేళనం మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి ఐకేరెడ్డి హాజరయ్యారు. ముందుగా మహాత్మా జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు శివకోటి మందిరంలో ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత పది వార్డుల కౌన్సిలర్లు తమ వార్డుల పరిధిలో జరిగిన అభివృద్ధిని వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తెలంగాణలోని సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేవన్నారు. పొరుగు రాష్ట్రాలు సైతం తెలంగాణ పథకాలు, పాలన వైపు చూస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లా ఏర్పాటుతో నిర్మల్ విద్య, వైద్య రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధించిందని తెలిపారు. నిరంతరం రాష్ట్ర అభివృద్ధి కోసం పరితపిస్తున్న కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించాలన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను మూడోసారి అధికారంలోకి తీసుకురావాలని సూచించారు. మిషన్ భగీరథ ద్వారా నిర్మల్ నియోజకవర్గంలో 213 గ్రామాలకు రూ.300 కోట్లతో శుద్ధమైన తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. ఆసరా పథకంలో భాగంగా నియోజకవర్గంలో 69,156 మంది లబ్ధిదారులకు నెలకు సుమారు రూ.15.20 కోట్లు పింఛన్ రూపంలో పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ ఒకేచోట అందేలా ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవనం రూ.56 కోట్లతో నిర్మించినట్లు తెలిపారు. సుమారు రూ.48.83 కోట్లతో 250 పడకల జిల్లా ఆస్పత్రి భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. రూ.166 కోట్ల వ్యయంతో 100 ఎంబీబీఎస్ సీట్ల ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మిస్తున్నట్లు తెలిపారు.

బీజేపీ ఇచ్చిందేమీ లేదు..

ఎనిమిదేళ్ల కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రానికి ఇచ్చింది ఏమీ లేదన్నారు. తెలంగాణపై ప్రధాని మోదీ వివక్ష చూపుతున్నారని తెలిపారు. పెట్రోల్, డీజిల్ ధరలను విపరీతంగా పెంచారని పేర్కొన్నారు. రూ.400 ఉన్న వంటగ్యాస్ సిలిండర్ ధరను, రూ.1,200 పెంచిన ఘనత మోదీదని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను సీఎం కేసీఆర్ ఎండగడుతున్నందుకే కవితను వేధిస్తున్నారని, కక్షసాధింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్, జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మరుగొండ రాము, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, కౌన్సిలర్లు అయ్యన్నగారి రాజేందర్, నేరెళ్ల వేణు, నాయకులు అప్పల వంశీ, పూదరి సాయికృష్ణ, పూదరి నరహరి, నేరెళ్ల సాయి, నజీరుద్దీన్, ముడుసు సత్యనారాయణ , తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు లక్ష్మణచారి తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో మంత్రి



ఇఫ్తారు విందులో పాల్గొన్న మంత్రి, కలెక్టర్..

నిర్మల్‌టౌన్:జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్‌లో తెలంగాణ ముస్లిం ఉద్యోగుల సంఘ భవనంలో మంగళవారం సాయంత్రం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి హాజరయ్యారు. ముస్లింలతో కలిసి విందును స్వీకరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసం మహోన్నతమైనదని పేర్కొన్నారు. ఈనెల18న హోం మంత్రి మహమూద్ అలీ చించోలి వద్ద నూతనంగా నిర్మించిన ఈద్గాను ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ రాంబాబు, మున్సిపల్ చైర్మన్ జి.ఈశ్వర్, ఆర్డీవో స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

నిర్మల్‌చైన్‌గేట్: రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు పడకండి రమాదేవి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బూత్ స్వశక్తి అభియాన్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. యువమోర్చా జాతీయ కార్యదర్శి సోలంకి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిష్టానం ఆదేశాల మేరకు బూత్‌స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రతీ ఇంటికి చేరేలా చూడాలని కార్యకర్తలకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని పేర్కొన్నారు. సమావేశంలో పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు అలివేలు మంగ, పార్లమెంట్ సంఘటన మంత్రి రవి, నిర్మల్ అసెంబ్లీ కన్వీనర్ నాయుడు మురళి, ముధోల్ అసెంబ్లీ కన్వీనర్ తాడేవార్ సాయినాథ్ , ఖానాపూర్ అసెంబ్లీ కన్వీనర్ పడల రాజశేఖర్, రవీందర్‌రెడ్డి, అసెంబ్లీ సంఘటన మంత్రి అఖిలేశ్‌రెడ్డి, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఒడిసెల అర్జున్, దళితమోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐదుగురికి కరోనా

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో కోవిడ్ కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. రెండు రోజుల వ్యవధిలోనే పది మంది కరోనా వైరస్ బారినపడ్డారు. మంగళవారం జిల్లాలో 54 మందికి పరీక్షలు నిర్వహించగా 49 మందికి నెగిటివ్ వచ్చింది. జైనథ్ మండలం సావాపూర్ గ్రామానికి చెందిన ఏడాది బాలిక, మాండగడలో యాభైఏళ్ల వ్యక్తికి, నార్నూర్‌లో ఏడాది బాలుడు, ఉట్నూర్ మండలం సాలెవాడలో యాభైఏళ్ల మహిళ, గుడిహత్నూర్ మండల కేంద్రానికి చెందిన వృద్ధునికి పాజిటివ్ వచ్చింది. ప్రస్తుతం 13 యాక్టివ్ కేసులు ఉన్నాయి. రిమ్స్‌లో ముగ్గురు, హోం ఐసోలేషన్‌లో పదిమంది చికిత్స పొందుతున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కుంటాల(ముధోల్): మండల కేంద్రంలోని బస్టాండు సమీపంలో మంగళవారం పేకాట స్థావరంపై స్పెషల్ టీం అధికారులు దాడిచేసినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.15,680 నగదుతో పాటు మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 23 మందికి జరిమానా

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 23 మందికి జరిమానా విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం తీర్పునిచ్చినట్లు నిర్మల్ పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా మద్యం మత్తులో వాహనం నడుపుతూ పలువురు పట్టుబడడంతో కోర్టులో హాజరు పరిచారు. 23మందికి రూ.32,100 జరిమానా విధిస్తూ స్పెషల్ జ్యుడికల్ జడ్జి తీర్పుఇచ్చినట్లు వారు పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనం అప్పగింత

నిర్మల్‌టౌన్: పోయిన ద్విచక్ర వాహనాన్ని బాధితుడికి అప్పగించినట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని మంచిర్యాల ఎక్స్‌రోడ్ వద్ద ఈ ఏడాది మార్చి 16న తనిఖీలు నిర్వహిస్తుండగా ధ్రువీకరణ పత్రాలులేని ద్విచక్ర వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహనానికి పోలీసులు చలాన్ వేశారు. అట్టి మెసేజ్ సదరు యజమానికి పోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. మంగళవారం సీఐ మల్లేశ్‌కు వాహన ధ్రువపత్రాలను చూపించడంతో ట్రాఫిక్ ఎస్సైలు అతనికి వాహనాన్ని అప్పగించారు. తన ద్విచక్ర వాహనం అపహరణకు గురైందని యజమాని రామిరెడ్డి మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇదివరకే ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు


ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని పోలీస్ పెట్రోల్ బంక్ ఎదుట మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. టూ టౌన్ ఎస్సై విష్ణు ప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన సుభాన్ అలీ తమ కుమారుడితో కలిసి ద్విచక్రవాహనంపై తన ఇంటినుంచి బయలుదేరి కలెక్టర్‌చౌక్ వైపు వెళ్తుండగా ఎదురుగా రెండు ఆటోలు వేగంగా వచ్చి పరస్పరం ఢీకొన్నాయి. దీంతో ముందున్న ఆటో బైక్ వస్తున్న సుభాన్ అలీ, తన కుమారుడిపై బోల్తా పడడంతో ఇద్దరితో పాటు మరో ఆటోలో ప్రయాణిస్తున్న ఉపాధ్యాయురాలికి కూడా గాయాలయ్యాయి. బాధితులను వెంటనే రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మావోయిస్టులు లొంగిపోవాలని పోస్టర్లతో ప్రచారం

కోటపల్లి(చెన్నూర్): మావోయిస్టులు వనాలు వీడి జనాల్లోకి రావాలని సరికొత్త కార్యక్రమాలతో కోటపల్లి పోలీసులు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మావోయిస్టు అగ్రనేతలు, వారిపై ఉన్న రివార్డులను ఫొటోలతో సహా ముద్రించి మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో అతికిస్తూ ఎస్సై వెంకట్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని గ్రామస్తులకు సూచిస్తున్నారు.

అభాగ్యులకు అభయం!

- ఆర్థిక భరోసాకు 'మిషన్ వాత్సల్య'
- కోవిడ్‌తో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు నెలకు రూ.4 వేలు
- ఇతర కారణాలతో అనాథలైన వారికి నెలకు రూ.2 వేల ఆర్థికసాయం అందజేత



మంచిర్యాలటౌన్: తల్లిదండ్రులను కోల్పోయి అభాగ్యులైన పిల్లలకు మహిళా శిశు సంక్షేమశాఖ ద్వారా ఆర్థికసాయం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మిషన్ వాత్సల్య పథకాన్ని అమలు చేస్తున్నాయి. మంచిర్యాల జిల్లాలో అనాథలు, తల్లిదండ్రులకు దూరమైన వారు, పాక్షికంగా అనాథలు (తల్లి లేక తండ్రిని కోల్పోయిన వారు), ప్రాణాంతకమైన వ్యాధి బారిన పడి, పేదరికంతో ఇంటిపెద్దను కోల్పోయిన వారు, ఇతరత్రా కారణాలతో తల్లిదండ్రులను కోల్పోయి ఇతరులపై ఆధారపడి జీవిస్తున్న 56 మందికి, హెచ్ఐవీ, తలసేమియా, అనారోగ్యంతో ఉన్న తల్లిదండ్రుల పిల్లలు ఆరుగురికి ప్రతీనెల రూ.2 వేల చొప్పున అందిస్తున్నారు. కరోనా సమయంలో తల్లి లేదా తండ్రి, ఇద్దరినీ కోల్పోయిన జిల్లాలోని ఆరుగురు చిన్నారులకు మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా నెలకు రూ.4 వేల ఆర్థికసాయం అందిస్తున్నారు. కుమురం భీం జిల్లాలో కోవిడ్‌తో తల్లిదండ్రులను కోల్పోయిన ఏడుగురు చిన్నారులకు, నిర్మల్ జిల్లాలో ఇద్దరు చిన్నారులకు పథకం కింద రెండు సంవత్సరాలుగా రూ.4వేల ఆర్థికసాయం అందిస్తున్నారు. చిన్నారులకు 18 ఏళ్లు నిండేవరకు సాయం అందిస్తామని అధికారులు తెలిపారు. ఈ పథకం ద్వారా అందరికీ రూ.4 వేలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం పేర్కొన్నా రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ నుంచి మాత్రం కోవిడ్ బాధిత కుటుంబాల పిల్లలకు మాత్రమే రూ.4 వేలు అందిస్తున్నట్లు మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

ఎంపిక ఇలా..

అర్హులైన వారు స్థానికంగా ఉండే అంగన్‌వాడీ కేంద్రంలో సంప్రదించడంతో పాటు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం, బాలల సంరక్షణ విభాగంలోనూ సంప్రదించాలి. వచ్చిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి, సీడబ్ల్యూసీ అధికారి, డీసీపీవో, ఎస్‌బీసీపీవో, శిశు, గృహ సంక్షేమాధికారి, జిల్లాలోని ఓ స్వచ్ఛంద సంస్థకు చెందిన అధికారి, తదితర సభ్యులున్న కమిటీ సభ్యులు అర్హులను ఎంపిక చేస్తారు.

జత చేయాల్సిన పత్రాలు

జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, తల్లి, లేదా తండ్రి మరణ ధ్రువీకరణ పత్రం, గార్డియన్ (సంరక్షకుడు) ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, బోనోఫైడ్ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు అకౌంట్ వివరాలు, బాలుడు లేదా బాలిక వ్యక్తిగత అకౌంట్ లేదా తల్లి, తండ్రి లేదా సంరక్షకుల జాయింట్ అకౌంట్.

ఆర్థికసాయం అందిస్తున్నాం



మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా జిల్లాలో కోవిడ్‌తో తల్లిదండ్రులను కోల్పోయిన ఆరుగురు పిల్లలకు నెలకు రూ.4 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నాం. తల్లిదండ్రులను కోల్పోయిన, అనాథలుగా మారిన, పేదరికంతో ఉంటూ ఇంటిపెద్దను కోల్పోయిన, విడాకులు పొందిన, ప్రాణాంతక వ్యాధి బారిన పడ్డ తల్లిదండ్రులు ఉన్న పిల్లలు 62 మందికి చదువుకోసం ప్రతీనెల రూ.2 వేల ఆర్థికసాయం అందిస్తున్నాం.

– చిన్నయ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారి, మంచిర్యాల

అర్హులు వీరే

ఎటువంటి ఆదరణ లేక అభాగ్యులుగా మిగిలిన పిల్లలకు చేయూత అందించేందుకు కేంద్ర ప్రభుత్వం మహిళా, శిశు సంక్షేమ శాఖ ద్వారా మిషన్ వాత్సల్య పథకాన్ని ప్రవేశపెట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి స్పాన్సర్‌షిప్‌ను కల్పిస్తున్నాయి. నిరాదరణ, పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువుకు దూరం కాకుడదనే ఉద్దేశంతో ఈ పథకాన్ని చేపట్టారు. జిల్లాలో ఉన్న అనాథలు, అభాగ్యులు, తల్లిదండ్రులు కోల్పోయిన వారు, తల్లిదండ్రులు దూరమైన వారు పాక్షిక అనాథలు (తల్లి లేక తండ్రిని కోల్పోయిన వారు), తల్లిదండ్రులు విడాకులు పొందిన వారి పిల్లలు, కుటుంబం వదిలేసిన, తల్లిదండ్రులు ప్రాణాంతక వ్యాధి బారిన పడినవారు, పేదరికంతో ఇంటి పెద్దను కోల్పోయినవారు, ఇల్లులేని పిల్లలకు, ప్రకృతి వైపరీత్యానికి గురైన బాలకార్మికులు, అక్రమ రవాణా, దాడులకు గురైన బాలలు, బాల యాచకులు, బాల్య వివాహం, హెచ్ఐవి బాధిత, పీడిత బాలలు, తలసేమియా వ్యాధి బారిన పడ్డ బాలలకు పథకాన్ని వర్తింపజేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96 వేలకు మించరాదు. ఈ పథకానికి ఎంపికైన వారు ఇంటినుంచి పాఠశాలకు వెళ్తే ఆర్థిక సాయం ఇవ్వనున్నారు. చదువు మధ్యలో ఆపేస్తే ఆర్థికసాయం నిలిపివేస్తారు. ఈ పథకం ద్వారా కేవలం కోవిడ్ బాధిత కుటుంబాల పిల్లలకు మాత్రమే రూ.4 వేలను ఇస్తుండగా, మిగతా వారికి రూ.2 వేల చొప్పున ఆర్థిక సాయంను అందిస్తున్నారు.

ఆలయ నిర్మాణ పనులు పరిశీలన



పరిశీలిస్తున్న ఎస్ఈ, స్థపతి

సారంగపూర్(నిర్మల్): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహాపోచమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులను మంగళవారం స్థపతి వల్లినాయగం, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఎస్ఈ మల్లికార్జున్ రెడ్డి పరిశీలించారు. పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్ జగన్మోహన్‌రెడ్డికి సూచించారు. ఆలయం పూర్తిగా కృష్ణశిలలతో నిర్మిస్తున్న నేపథ్యంలో పునాది ధృఢంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ అధ్యక్షుడు ఆయిటి చందు, ఆలయ సీనియర్ అసిస్టెంట్ రమణారావు, ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాస శర్మ, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలు



గాయపడిన రాజేందర్

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్‌లో ఐదుగురు వ్యక్తులతో పాటు పలు పశువులు, పెంపుడు కుక్కలపై మంగళవారం ఓ పిచ్చికుక్క దాడికి పాల్పడింది. గ్రామానికి చెందిన కమ్మరి రాజేందర్, జంగిలి అంజలి, తుమ్మ నర్సయ్య, వేల్పుల శ్యాం, గాజుల నర్సవ్వతో పాటు గ్రామంలోని పలుదూడలు, పెంపుడు కుక్కలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఈ సందర్భంగా గ్రామస్తులు శునకాన్ని చంపివేశారు. గ్రామంలో కుక్కల బెడద లేకుండా పంచాయతీ అధికారులు దృష్టి సారించాలని గ్రామస్తులు కోరారు.

ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలు అందజేస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: స్థలం ఉన్న వారికి ఇళ్లు నిర్మించుకునేందుకు త్వరలోనే రూ.3 లక్షలు అందజేస్తామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ రూరల్ మండలం ఖండాల గ్రామ పంచాయతీ పరిధిలోని పోతగూడలో బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ సమావేశానికి హాజరుకాని వారిని కమిటీల నుంచి తొలగించాలని పార్టీ మండల నాయకులకు సూచించారు. మన పార్టీ పట్ల ఎంత మంది అనుకూలంగా ఉన్నారు..అసంతృప్తులు ఎంతమంది ఉన్నారు.. వారికి పార్టీ తరుపు నుంచి ఎలాంటి సాయం చేస్తే అనుకూలంగా మారుతారు అనే పూర్తి సమాచారం గ్రామ కమిటీల వద్ద ఉండాలన్నారు. గ్రామస్థాయి కార్యకర్త నుంచి మండల స్థాయి కార్యకర్త వరకు ముందుగానే పని విభజన చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గండ్రత్ రమేశ్, వైస్ ఎంపీపీ జంగు, పీఏసీఎస్ చైర్మన్ పరమేశ్వర్, ఆత్మ చైర్మన్ జిట్ట రమేశ్, సర్పంచులు అశోక్, కిషన్, పార్టీ నాయకులు కనక రమణ, సేవ్వ జగదీష్, కుమ్ర రాజు, తదితరులు పాల్గొన్నారు.

విరిగిన స్తంభం.. తప్పిన ప్రమాదం

ఖానాపూర్: పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన లారీ ఢీకొట్టిన ఘటనలో ఓ విద్యుత్ స్తంభం విరిగి పెను ప్రమాదం తప్పింది. రోడ్డుకు మధ్యలో ఉన్న స్తంభాలను సంబంధిత అధికారులు సకాలంలో తొలగించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మంగళవారం సైతం ఓ లారీ స్తంభాన్ని ఢీకొట్టడంతో స్తంభం పాక్షికంగా దెబ్బతిని పెను ప్రమాదం తప్పింది. సంబంధిత అధికారులు స్పందించి మరో స్తంభం వేయాలని ప్రజలు కోరుతున్నారు.



లారీ ఢీకొట్టడంతో విరిగిన స్తంభం

సహకార 'బంక్'ల కథ కంచికేనా?

- మూతబడుతున్న వినియోగదారుల పెట్రోల్ బంకులు
- ఆర్థిక నష్టాల్లో సహకార సంఘాలు
- అగమ్య గోచరంగా బంకుల నిర్వహణ



మూతబడిన తాండూర్ పెట్రోల్ బంక్

తాండూర్(బెల్లంపల్లి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న సదుద్దేశంతో ఉమ్మడి జిల్లాలో చేపట్టిన పెట్రోల్ బంక్‌ల నిర్వహణ గాడితప్పింది. వాటి నిర్వహణపై పాలకవర్గానికి, అధికారులకు చిత్తశుద్ధి లేకపోవడంతో ఆదిలోనే బంకులు మూతపడే పరిస్థితులు దాపురించాయి.

ధరలో వ్యత్యాసం..నిర్వహణ భారం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 67 సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో 7 సహకార సంఘాల తరపున పెట్రోల్ బంక్‌లను ఏర్పాటు చేయాలని 2017లో ప్రతిపాదనలు చేశారు. 2018లో కడెం, అంగీర్గా, తానూరు, కుభీర్, తాండూర్‌లలో ప్రారంభించారు. బంకుల స్థాపనకు డీసీసీబీ నుంచి రూ.40 లక్షల వరకు రుణం తీసుకున్నారు. స్థలానికి నెలకు రూ.5వేల నుంచి రూ.10 వేల వరకు చెల్లిస్తామని లీజుకు తీసుకున్నారు. సహజంగా వినియోగదారుల పెట్రోల్ బంకుల్లో ధర కాస్తా తక్కువగా ఉంటుందని వినియోగ దారులు భావిస్తారు. కానీ ప్రైవేట్ బంకుల కంటే లీటర్ పెట్రోల్ రూ.18, డీజిల్ రూ.20 వరకు అధికంగా ఉండడంతో వినియోగదారులు అటువైపు వెళ్లడం మానేశారు. దీంతో గిరాకీ లేక, నిర్వహణ కొరవడి బంకులు మూసివేయాల్సిన ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. తాండూర్‌లోని పెట్రోల్ బంక్‌ను మండల కేంద్రానికి 6 కిలో మీటర్ల దూరంలో ఏర్పాటు చేయడంతో ఏమాత్రం గిరాకీ లేక మూతపడింది. తానూర్, కుభీర్, కడెం పెట్రోల్ బంక్‌లను కమర్షియల్ బంక్‌లుగా మార్చేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో రెండు నెలల క్రితం పునఃప్రారంభించి పెట్రోల్ అమ్మకాలు మాత్రమే సాగిస్తున్నాయి. కొత్తగా జన్నారం, చింతగూడలో వినియోగదారుల బంక్‌లను కమర్షియల్ బంక్‌ల పేరుతో ఏర్పాటు చేయడంతో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాలేదు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పెట్రోల్‌బంక్‌ల నిర్వహణకు సంబంధించి స్థానికంగా నెలకొన్న పరిస్థితులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. తాండూర్ బంక్‌ను కమర్షియల్ చేసుకోవాలని లేదంటే మరో ప్రాంతానికి తరలించే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆ రెండు పద్ధతులు కూడా ఆర్థికభారంతో కూడుకున్నవి కావడంతో అంతిమ నిర్ణయం తీసుకోలేక సతమతమవుతున్నాం.

– శ్రీనివాస్, సీఈవో, పీఏసీఎస్, తాండూర్

నీ సంగతి చూస్తా..

- సర్పంచ్‌ను బెదిరించిన ఎమ్మెల్యే రేఖానాయక్
- గ్రామసభలో ప్రొటోకాల్ పాటించ లేదని ఎమ్మెల్యేను నిలదీసిన సర్పంచ్



సర్పంచ్‌తో వాగ్వాదానికి దిగిన ఎమ్మెల్యే రేఖానాయక్

కడెం(ఖానాపూర్): కలెక్టర్ వరుణ్‌రెడ్డి, గ్రామస్తుల సమక్షంలో ఎమ్మెల్యే రేఖానాయక్..సర్పంచ్ నరేందర్‌రెడ్డి నువ్వెంత.. అంటే నువ్వెంత.. అని గొడవకు దిగారు. మంగళవారం మండల కేంద్రంతో పాటుగా కన్నాపూర్ గ్రామ పంచాయతీలో నిర్వహించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్ల గ్రామసభలో ఎమ్మెల్యే రేఖానాయక్ స్థానిక సర్పంచ్(బీఆర్ఎస్ పార్టీ) నరేందర్‌రెడ్డి పేరును ప్రస్తావించలేదు. దీంతో సర్పంచ్ నా ఊరికి వచ్చి నా పేరు ప్రస్తావించకుండా ఎలా మాట్లాడుతున్నావ్ అని ఎమ్మెల్యేను నిలదీశాడు. దీంతో ఆవేశానికి లోనైనా ఎమ్మెల్యే రేఖానాయక్ నేను నియోజవర్గానికి ఎమ్మెల్యేను..నీ పేరు చెప్పలేదు కావచ్చు అయితే ఏంది.. నేను ఎస్టీ మహిళ అని నువ్వు రెచ్చిపోతున్నావ్..రేపు నీ సంగతి చూస్తా.. అని సర్పంచ్‌ను బెదిరింపులకు గురిచేసింది.

పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుకున్న బియ్యంతో ఎస్సై ఆర్.శంకర్

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి గ్రామ శివారులోని ఓ పశువుల కొట్టంలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై ఆర్.శంకర్ తెలిపారు. 19 బస్తాలలో నిల్వ ఉంచిన బియ్యాన్ని స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. ఎవరైనా పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

- ఎంపీ సోయం బాపురావు

ఆదిలాబాద్: రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు అన్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కేఆర్‌కే కాలనీలో కేఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తాగునీటి పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీసం తాగునీటి సౌకర్యాలను కల్పించలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి ఏళ్లు గడుస్తున్నా ఆదిలాబాద్ మున్సిపాలిటీలోని కాలనీల్లో కనీస వసతుల కల్పనలో ఎమ్మెల్యే జోగు రామన్న, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ విఫలమయ్యారన్నారు. వారి చేతకాని తనం వల్లే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి న పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పెంబి జెడ్పీటీసీ జాను బాయి, దక్షిణ మధ్య రైల్వే బోర్డ్ మెంబర్ జీవి రమణ, నాయకులు చిత్రు, సంతోష్ సింగ్ ఠాకూర్, రాజకుమార్ పాల్గొన్నారు.



తాగునీటి పంపిణీ ప్రారంభిస్తున్న ఎంపీ

నకిలీ వైద్యుల చెలగాటం..!

- పేరొకరిది.. వైద్యం మరొకరిది..!
- భైంసాలోని ఓ ఆస్పత్రిలో వెలుగుచూసిన ఘటన

భైంసాటౌన్(ముధోల్): భైంసాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నకిలీ వైద్యులు రోగులతో చెలగాటమాడుతున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. పట్టణంలోని గోకుల్‌నగర్‌లో ఈఎన్‌టీ(చెవి, ముక్కు, గొంతు), చర్మసంబంధ ఆస్పత్రి నిర్వహిస్తున్నారు. పట్టణానికి చెందిన కోర్వ సచిన్ సోమవారం చర్మసంబంధ చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లి సంబంధిత వైద్య నిపుణులు రాజేశ్ కోసం అడిగారు. ఓపీ చీటీతో వైద్యం కోసం లోనికి వెళ్లగా రాజేశ్‌కు బదులు మరోవ్యక్తి (ధన్‌రాజ్) వైద్యం అందించడంపై అనుమానించాడు. మీరు డాక్టర్ రాజేశ్ కాదు.. మీ పేరేంటని ప్రశ్నించగా తన పేరు రాజు అని చెప్పినట్లు తెలిపాడు. అప్పటికే అక్కడ ప్రిస్క్రిప్షన్‌పై రాజేశ్ పేరు ఉందని, మీరు ఆయన పేరిట ఎలా వైద్యం చేస్తున్నారని బాధితుడు ప్రశ్నించగా సరైన సమాధానం ఇవ్వలేదన్నాడు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, నకిలీ వైద్యులను అరికట్టాలని కోరారు. నకిలీ వైద్యంపై డీఎంహెచ్‌వో ధన్‌రాజ్‌ను వివరణ కోరగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.



మాట్లాడుతున్న బాధితుడు సచిన్



మహనీయుని వేడుక.. జనంలేక వెలవెల

జిల్లా బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన మహాత్మా జ్యోతిబాపూలే 197వ జయంతి వేడుకలు వెలవెలబోయాయి. ప్రజలు రాకపోవడంతో ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. వేదికపై ప్రసంగించిన బీసీ సంఘాల నాయకులు సైతం ఈ విషయంలో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్